# నేనెందుకు నాస్తికుణ్ణయ్యాను? - భగత్ సింగ్

సర్వశక్తి సంపన్నుడూ, సర్వాంతర్యామీ, సర్వజ్ఞుడూ అయిన దేవుడి ఉనికిని నేను నమ్మకపోవడం అహంకారంవల్లనా? ఇది నాలో ఉదయించిన కొత్త ప్రశ్న.ఇలాంటి ప్రశ్నను ఎదుర్కోనవలసి వస్తుందని నేనెప్పుడూ ఊహించలేదు.అయితే దైవం కన్నా నేనే గొప్ప అనే ఆధిక్యభావన నాలో ఉన్నందువల్లనే దేవుని ఉనికిని నిరాకరిస్తున్నానని , దేవుణ్ణి నమ్మకపోవడానికి కొంతవరకు నా అహంకారము కూడా కారణమని నా మిత్రులుకొందరు నాతోవున్న కొద్దిపాటి పరిచయాన్ని పురస్కరించుకొని మాటల సందర్భంగా నాతో సూచనగా అన్నారు.వీళ్ళు నామిత్రులని అనుకోవడం ఎంతవరకు సరైందో తెలియదు.ఈ సమస్య మాత్రం తీవ్రమైనదే.మానవ సహజమైన ఈ లక్షణాలకు నేను అతీతుణ్ణని గొప్పలు చెప్పుకోవడం లేదు.నేనూ మామూలు మనిషినే. అంతకుమించి మరేమీ కాదు. నేనేకాదు , ఎవరైనా అలా అనుకోలేదు.నా స్వభావంలో అహంకారం ఒక భాగం. ఈ బలహీనత నాలోనూ ఉంది.నా మిత్రులు నన్ను నియంత అని పిలిచేవాళ్ళు. నా ముఖ్య స్నేహితుడు బి.కె.దత్ కూడా అలాగే పిలిచేవాడు. కొన్ని సందర్భాలలో నిరంకుశుడని నన్ను నిందించడంకూడా జరిగేది.నా అభిప్రాయాన్ని ఇతరులపై బలవంతంగా రుద్ది ,నాసూచనల్ని ఆమోదింపచేసుకుంటానని కొందరు తీవ్రంగా ఆక్షేపించేవాళ్ళు.కొంతవరకైనా ఇది నిజమని నేనూ అంగీకరిస్తాను. ఇది అహంభావమేకావచ్చు.బాగా ప్రచారంలోవున్న ఇతర భావధోరణులకూ, నాభావధోరణికి ఘర్షణ జరిగినప్పుడు నాలో అహంకారం తొంగిచూస్తుంది.అయితే ఇది వ్యక్తిగతమైనది కాదు.నా ధృక్పథం పట్ల నాకున్న గట్టి నమ్మకమేగాని, గర్వం కాదు.ఒక వ్యక్తికి తానంటేఉన్న గర్వాతిశయాన్నే అహంకారం అంటాం. నన్ను నాస్తికుణ్ణి చేసింది ఈ అహంకారమేనా? లేక కొంతకాలంపాటు ఈవిషయం గూర్చి శ్రద్ధాశక్తులతో నేను చేసిన అధ్యయనమా? దీన్నిగురించి నేనిక్కడ చర్చిస్తాను.అహంభావానికి,గర్వానికీ తేదావుందన్నవిషయాన్ని మొదట స్పష్టం చెయ్యాలి.

దేవుణ్ణి నమ్మకపోవడానికి అనుచితమయిన గర్వంకానీ, మితిమీరిన అహంకారం కాని ఎలా కారణాలవుతాయో నాకర్థం కావడంలేదు. సరైన యోగ్యతా ,అవసరమైన సుగుణాలు లేకుండానే కొంతయినా నేను ప్రజాభిమానం పొందిఉంటే , ఒక మహాపురుషుడి గొప్పదనాన్ని నిరాకరించగలను. ఆ మేరకది సాధ్యమే.అయితే దేవుడిపైన నమ్మకం వున్నవాడు కేవలం తన గర్వం మూలంగా ఆ నమ్మకాన్ని ఎలాపోగొట్టుకోగలడు? ఇది రెండు రకాలుగా జరగవచ్చు – మానవుడు తాను దేవుడికి పోటీదారుణ్ణని భావించడం వల్లా, లేదా తానే దేవుణ్ణని అనుకోవడం వల్లా. ఈ రెండు సందర్భాలలోనూ అతడు నిఖార్సయిన నాస్తికుడు కాలేడు. దేవుడికి తాను పోటీదారుణ్ణి అని భావించినప్పుడుగానీ ,లేక తానే దేవుణ్ణని అనుకున్నప్పుడుగానీ రెండు సందర్భాలలోనూ దేవుడి వునికిని వొప్పుకున్నట్టయింది. ఆ దేవుడు తానే అనుకొన్నా వేరే అనుకొన్నా నసకొక్కటే. ప్రధానమైనది ,అతని నమ్మకం. దానికిక్కడ స్థానం ఉంది. కాబట్టి ఏవిధంగా చూసినా అతడు నాస్తికుడుకాడు. మరి నా విషయానికొస్తే, పైరెండు ధోరణులకు చెందినవాణ్ణి కాను నేను. సర్వ శక్తి సంపన్నుడైన ఆ పరమ పురుషుడి ఉనికినే కాదంటున్నాను. ఎందుకు కాదంటున్నానో తర్వాత చెబుతాను. నాస్తికవాద సిద్ధాంతాన్ని నేను అనుసరించానంటే గర్వం వల్ల మాత్రం కాదని ముందిక్కడ స్పష్టం చెయ్యాలి.నేనే ఆ పరమ పురుషుణ్ణి కాను.అతగాడి అవతారాన్ని కాను.పోటీదారుణ్ణి అంతకంటేకాను. ఇలాంటి భావధోరణికినన్ను మరల్చింది గర్వం మాత్రం కాదనేది పచ్చినిజం. నాపై ఉన్న ఈ ఆరోపణ నిజంకాదని నిరూపించేందుకు ఇంకా కొన్ని వాస్తవ విషయాల్ని పరిశీలిద్దాం. ఢిల్లీ బంబు కేసులోనూ,లాహోర్ కుట్ర కేసులోనూ జరిగిన విచారణమూలంగా నాకు తగని ప్రజాభిమానం లభించి గర్వబోతునయ్యానని నా మిత్రుల అభిప్రాయం. వీరి ఊహల్లో నిజమెంతో చూద్దాం. నా నాస్తికవాదం ఇటీవల వచ్చిందేమీకాదు. ఏ పేరూ ప్రఖ్యాతీ లేని ఒకానొక యువకుడిగా ఉన్నప్పుడే దేవుణ్ణి నమ్మడం మానేశాను. అప్పటికీ నేననేవాణ్ణి ఉన్నానన్న సంగతే ఈ మిత్రులికి తెలియదు.గర్వం వల్ల కనీసం కాలేజీ విధ్యార్థి కూడా నాస్తికుడు కాలేడు. కొందరు ప్రొఫెసర్లకు నేనంటే ఇష్టమే.కొందరికి మాత్రం అయిష్టంగా ఉండేది.నాకు కష్టపడి చదివే అలవాటుండేదికాదు.అందువల్ల గర్వంలాంటి భావాలు కలిగే అవకాశమేలేదు. నా జీవితం భవితవ్యాన్ని గురించి నాకు నిరాశాపూరితమైన దృక్పథం ఉండేది.పైగా చాలా జంకు.ఆ రోజుల్లో నా నాస్తికత అంతంతమాత్రంగానే ఉండేది. మా తాతగారి పెంపకంలో పెరిగినందువల్ల ఆయన ప్రభావం నామీద వుండేది. ఆయన శుద్ధ ఆర్యసామాజికుడు. ఆర్యసామాజికుడు ఏమైనా కాగలడుగానీ ,నాస్తికుడు మాత్రం కాడు. నేను ప్రాధమిక విద్య పూర్తిచేసి లాహోరులో డి.ఏ.వి. స్కూల్లో చేరాను. ఒక ఏడాదంతా హాస్టల్లో చేరాను. అప్పట్లో ఉదయం సాయంత్రం ప్రార్థనలుచేయటం

అటుంచి గంటలకొద్దీ గాయత్రీ మంత్రం జపించేవాణ్ణి. అంటే నాలో అచ్చమైన భక్తి ఉందన్న మాట. ఆ తర్వాత మానాన్నగారి దగ్గర వుంటూవచ్చాను. మతాలకు సంబంధించి పూర్వాచార పరాయణత్వం విషయంలో మానాన్నగారిది విశాల దృక్పథం. ఆయన బోధల ద్వారానే స్వాతంత్ర్య సాధన కోసం జీవితాన్ని అంకితం చేద్దామని నిర్ణయించుకున్నాను.అయితే ఆయన నాస్తికుడేమీ కాదు. చాలా గట్టి ఆస్తికుడు. రోజూ నన్ను కూడా ప్రార్థనలు చేయమనేవాడు. నేనిలా పెరిగి పెద్దవాణ్ణయ్యాను.సహాయనిరాకరణ ఉద్యమ కాలంలో జాతీయ కళాశాలలో చేరాను. కాస్త విశాలంగా ఆలోచిస్తూ మత సమస్యల్ని గురించి ,దేవుణ్ణి గురించి విమర్శనా దృష్టితో ఆలోచించడం మొదలు పెట్టింది అప్పుడే.అయినా అప్పటికి నేను భక్తిపరుణ్ణే. తలవెంట్రుకలు పెంచసాగాను. కొంతకాలానికి సిక్కుమతం,ఇంకా ఇతర మతాల పురాణాలపైనా, వాటి మూలసూత్రాలపైనా నమ్మకం పోయింది.అయినా దేవుడిపైన మాత్రం గట్టి నమ్మకం వుండేది.

ఆ తర్వాత విప్లవ పార్టీలో చేరాను. మొదట నాకు పరిచయమైన, ఆ పార్టీ నాయకుడికి దేవుడి విషయంలో గట్టి నమ్మకం లేకపోయినా,నిరాకరించగల సాహసం కూడాలేదు. దేవుణ్ణి గూర్చి ఆయన్ను గుచ్చి గుచ్చి అడిగేవాణ్ణి. " నీ కిష్టమైనప్పుడు ప్రార్థించు " అనేవాడు. ఇదీ నాస్తిక వాదం కాదు. నాస్తిక వాదానికి ఇంకా ఎక్కువ ధైర్యం కావాలి.ఆ తర్వాత నాకు పరిచయమైన మరొక నాయకుడు గట్టి నాస్తికుడు.ఆ కామ్రేడ్ పేరు శచీంద్రనాథ్ సన్యాల్. ఇప్పుడాయన కరాచీ కుట్రకేసు మూలంగా యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్ష అనుభవిస్తున్నాడు. ఆయన ' బందీ జీవన్ 'అనే పుస్తకం వ్రాసాడు. అది చాలా ప్రసిద్ధి పొందింది. మొదటి పేజీలోనే ఈశ్వర సంకీర్తనం కనిపిస్తుంది. వేదాంత మత ప్రభావమువల్ల భక్తిపారవశ్యంతో చేసే ఈశ్వర సంకీర్తనలు ఆయన ఆలోచనల్లో ప్రధాన భాగం. ఆపుస్తకం రెండోభాగం చివరి పేజీలో ఇది కనిపిస్తుంది. 1925 జనవరి 28న భారతదేశమంతటా పంచిపెట్టబడ్డ " విప్లవ కరపత్రం ", ప్రాసిక్యూషన్ కధనం ప్రకారం ఆయన శ్రమ ఫలితమే.

వ్యక్తిగతంగా తనకిష్టమైన భావాలను రహస్యంగా ఉండిపోయిన తన గ్రంధంలో వ్యక్తపరిచాడు. ఇది తప్పుదు. ఆయన గొప్ప నాయకుడు కాబట్టి ,ఎన్ని విభేధాలున్నా, తన అభిప్రాయాన్ని అనుచరులు మన్నించవలసిందే. సదరు కరపత్రంలో ఒక పేరా మొత్తం సర్వేశ్వరుణ్ణి,అతని లీలల్ని కీర్తించడానికే కేటాయించడం జరిగింది. ఇదంతా భక్తిపారవశ్యం. ఇంతకూ నేను చెప్పదలుచుకున్నదేమిటంటే- విప్లవ పార్టీలో నాస్తిక భావం అంకురించనైనా లేదని, కకోరీ అమర వీరులు నలుగురూ తమ అంతిమ దినాన్ని ప్రార్థనలతోనే గడిపేశారు. రాంప్రసాద్ బిస్మిల్ పూర్వాచార పరాయణుడైన ఆర్య సామాజికుడు. సోషలిజం, కమ్యూనిజాల గురించి ఎంతో అధ్యయనం చేసినప్పటికి, రాజన్ లాహిరి ఉపనిషత్ సూక్తాలనూ, గీతా వచనాలనూ వల్లించాలనే కోరికను చంపుకోలేకపోయాడు. దైవత్వానికి కారణం మానవ దౌర్బల్యమో, విజ్ఞాన పరిమితో తప్ప మరొకటి కాదంటూ, ప్రార్థనలే చేయని వ్యక్తిని ఆ నలుగురిలో ఒక్కర్నే చూశాను. అతను కూడా యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నాడు. అయితే అంతటి వాడికి కూడా దేవుడి ఉనికిని కాదనే ధైర్యం లేకపోయింది.

అప్పటి వరకూ నేను ఒట్టి ఆదర్శవాద విప్లవకారుణ్ణి మాత్రమే. మేమంతా అనుచరులమే. మొత్తం బాధ్యతను భుజాన మొయ్యవలసిన సమయం ఇప్పుడొచ్చింది. అనివార్యమైన ప్రభుత్వ దమనకాండ వల్ల పార్టీ వునికే కొంతకాలం అసాధ్యమైపోయింది. ఉత్సాహవంతులైన కామ్రేడ్లు – వారు నాయకులు కూడా – మమ్మల్ని హేళన చేయసాగారు. మా కార్యక్రమం వ్యర్ధమౌతుందేమోనని, నేను కూడా ఏదో ఒక రోజున ఆశ వదులుకోవలసి వస్తుందేమోనని భయంగా వుండేది. నా అంతరంగంలో " అధ్యయనం చెయ్ " అనే పిలుపు మార్మోగసాగింది. వ్యతిరేకులు లేవదీస్తున్న వాదాల్ని ఎదుర్కొనే నేర్పు కలగాలంటే అధ్యయనం చెయ్యాలి. నా భావ ధోరణికి అనుకూలమైన వాదాలతో సాయుధుడిని కావాలంటే అధ్యయనం చెయ్యాలి. అధ్యయనం చెయ్యసాగాను. వెనకటి నమ్మకాలు, అభిప్రాయాలూ గణనీయమైన మార్పుకు లోనయ్యాయి. మా ముందు వారిలో దౌర్జన్య పద్ధతుల పట్ల ఉన్న ఆకర్షణ,ఆవేశం పోయి తీవ్రమైన భావాలేర్పడ్డాయి. పారవశ్యానికి, గుడ్డి నమ్మకాలకూ ఇక తావు లేదు. వాస్తవ వాదం మా భావధోరణి అయింది. ఎంతో అవసరమైతేనే బలప్రయోగం సమర్ధనీయం.

ప్రజా ఉద్యమాలన్నిటికీ అహింసే అనివార్యమైన విధానం. కార్యాచరణ పద్ధతుల గురించి స్పష్టత ఏర్పడడం అన్నిటికంటే ముఖ్య విషయం. కార్యరంగంలో ముఖ్యమైన కార్యకలాపాలేవీ అప్పట్లో లేవు గాబట్టి, ప్రపంచ విప్లవానికి సంబంధించి వివిధ ఆదర్శాలను అధ్యయనం చేయడానికి మంచి అవకాశం లభించింది. అరాచక వాద నాయకుడైన

బకునిన్ రచనలనూ, కమ్యూనిజానికి మూలపురుషుడైన మార్క్స్ రచనలు కొన్నీ, తమ దేశంలో విప్లవాన్ని జయప్రదం చేసుకున్న లెనిన్, ట్రాట్ స్కీ మొదలైన వారి రచనలు చాలా భాగం చదివాను. వాళ్ళంతా నాస్తికులే. బకునిన్ పుస్తకం " దేవుడూ-రాజ్యం " అసంపూర్తిగా వున్నా, అందులో ఈ అంశం గురించి ఆసక్తికరమైన పరిశీలన కనిపిస్తుంది.

ఆతర్వాత నిరాలంబ స్వామి " కామన్ సెన్స్ " అనే పుస్తకం నా కళ్ళబడింది. అందులో ఉన్నది నాస్తికవాదమే అయినా, అది నాకు అయోమయంగా కనిపించింది. మొత్తం మీద ఈ విషయం నాకెంతో ఆసక్తి కలిగించ సాగింది. ఈ మహా విశ్వాన్నంతా సృష్టించి, శాసించే ఒక పరమాత్మ ఉన్నాడన్న ఆస్తిక సిద్ధాంతం పరమ నిరాధారమయిందని 1926 నాటికి నాకు గట్టి అభిప్రాయం ఏర్పడింది. దేవుడిపైన నాకున్న ఈ అవిశ్వాసాన్ని నలుగురికీ తెలియజేసాను. ఈ విషయమై మిత్రులతో చర్చలక్కూడా దిగాను. ఖచ్చితమైన నాస్తికుణ్ణయ్యాను. దీని అర్థం ఏమిటో ఇప్పుడు వివరిస్తాను. 1927 మేలో నేను లాహోర్ లో అరెస్టయ్యాను. ఆ అరెస్టు హఠాత్తుగా జరిగింది. పోలీసులు నన్ను వెంటాడుతున్నారన్న విషయం కూడా నాకు తెలియదు. ఒక తోటలో పోతున్నప్పుడు ఉన్నట్టుండి నన్ను చుట్టుముట్టేశారు. ఆ క్షణంలో నేను పరమ ప్రశాంతంగా వుండడం నాకే ఆశ్చర్యం కలిగించింది. నాలో ఎలాంటి భావ సంచలనం గానీ, ఉద్రేకం గానీ కలగలేదు. పోలీసులు నిర్బంధంలో పెట్టారు. మర్నాడు రైల్వే పోలీసు లాకప్ కు తీసుకువెళ్ళారు. ఒక నెల రోజులు అక్కడే గడిపాను. వారి మాటల్ని బట్టి కకోరి పార్టీతో నాకేదో సంబంధముందనీ విప్లవోద్యమ సందర్భంగా జరిగిన సంఘటనల్లో నా ప్రమేయం ఉందనీ వారి దగ్గర భోగట్టా వున్నట్టు నాకర్థమయింది. లక్నో విచారణ సాగుతున్నప్పుడు నేనక్కడికి వెళ్ళాననీ, ఖైదీలను నిర్బంధం నుంచి తప్పించేందుకు ఒక పథకం గురించి ప్రస్తావించానని, వారి ఆమోదం పొందాక కొన్ని బంబులు కూడా సేకరించామనీ, వాటిని పరీక్షిద్దామని 1926 నాటి దసరా ఉత్సవంలో జన సమూహం మీద ఒక బాంబును వెయ్యటం జరిగిందని వాళ్ళు నాతో అన్నారు. విప్లవ పార్టీ కార్యకలాపాల్ని వెల్లడి చేస్తూ ఒక స్టేట్ మెంట్ గనుక ఇస్తే ,నన్ను జైలు నుండి విడుదల చెయ్యడమే కాక, కోర్టులో అప్రూవర్ గా కూడా నిలువకుండా బహుమానం సైతం ఇస్తామని నా "మేలు" కోరి చెప్పారు. విని నవ్వేశాను . ఇదంతా హంబక్ , మా అభిప్రాయాలున్నవాళ్ళెవ్వరూ అమాయకులైన తమ ప్రజల మీద బాంబులు వెయ్యటం జరగదు.ఒక రోజు ఉదయం సి.ఐ.డి. శాఖ సీనియర్ సూపరిన్టెంటు న్యూమాన్ నా దగ్గరికొచ్చాడు. చాలసేపు సానుభూతి ఒలకబోస్తూ మాట్లాడాడు. తాము కోరినట్టుగా నేను స్టేట్ మెంట్ ఇవ్వకపోతే, కరోరీ కేసు సందర్భంగానూ, దసరా బాంబు ప్రయోగంలో ఘోరమయిన ఖూనీల సందర్భం గానూ కేసు పెట్టి ప్రభుత్వ వ్యతిరేక యుద్ధం చేసేందుకు కుట్రపన్నినట్లు నన్ను విచారణకు పంపక తప్పదనే విషాద వార్తను బయటపెట్టాడు. నాకు శిక్ష వేయించి, ఉరి తీయించడానికి తగినంత సాక్ష్యం తమ దగ్గర ఉందని చెప్పాడు. పోలీసులు తల్చుకుంటే ఏమయినా చేయగలరు గానీ, నేను మాత్రం ఏ నేరమూ చేసి ఎరగననే అప్పట్లో అనుకున్నాను. అదే రోజున కొందరు పోలీసులు వచ్చి రెండు పూటలా వరసదప్పకుండా దేవుణ్ణి ప్రార్థించవలసిందిగా నాకు చెప్పటం మొదలుపెట్టారు. అప్పటికే నేను నాస్తికుణ్ణై వున్నానుగదా! జీవితం హాయిగా సాగిపోతున్నప్పుడే నేను నాస్తికుణ్ణని గొప్పలు చెప్పుకోవడమా? లేక ఇలాంటి కష్ట కాలంలో కూడా నా విశ్వాసాల్ని అంటిపెట్టుకొని వుండటమా? అనేది నాకు నేనే తేల్చుకోవాలనుకున్నాను. చాలా తీవ్రంగా ఆలోచించాను.

ఏ పరిస్థితిలో కూడా దేవుణ్ణి నమ్మలేనని, ప్రార్థించలేనని నిర్ణయించుకున్నాను. అంతే మరెప్పుడూ ఆ పని చేయ్యలేదు.ఇదే నిజమైన పరీక్ష . నేను నెగ్గాను. ఇతర ముఖ్య విషయాలన్నీ బలిపెట్టి నా ప్రాణాన్ని నిలబెట్టుకోవాలన్న కోరిక నాకెప్పుడూ కలుగలేదు.అంటే నేను గట్టి నాస్థికుణ్ణి అయ్యానన్నమాట.ఈనాటికీ అంతే, ఆ పరీక్ష నెగ్గటమంటే మాటలు కాదు.'విశ్వాసం' కష్టాల బరువును తగ్గిస్తుంది. ఒక్కోసారి కష్టాల్ని సుఖాలుగా కూడా మార్చగలుగుతుంది. భగవద్భక్తిలో మానవుడు ఊరట పొందుతాడు. రక్షణ కూడా లభించినట్టనిపిస్తుంది. దేవుడు లేకపోతే మానవుడు తనమీద తాను ఆధారపడాల్సిందే. జడివానల మధ్య, తుఫానుల మధ్య తన కాళ్ళ మీద తాను నిలబడటమంటే చిన్న పిల్లల ఆట కాదు. ఎలాంటి వ్యక్తిలోనైనా అహంకారమనేది వుంటే అది ఇలాంటి పరిక్షా సమయాల్లో ఆవిరై పోతుంది. పదిమందీ పాటించే నమ్మకాల్ని అతడొక్కడూ ధిక్కరించలేడు. ఒకవేళ ధిక్కరించగలిగాడో, అహంకారాన్ని మించిన మరొక బలమేదో అతన్లో ఉందనాలి.

సరిగ్గా ఇప్పటి నాపరిస్తితి ఇదే.తీర్పు ఏవిధంగా ఉండబోతుందో నాకు బాగా తెల్సు. వారం రోజులోనే తీర్పు చెప్ప బోతారు. ఒక ఆదర్శం కోసం ప్రాణత్యాగం చేస్తున్నానన్న సంతృప్తితప్ప ఇంకే ఊరట ఉందినాకు? ఆస్తికుడయిన హిందువు అయినా మరో జన్మలో తానొక మహారాజుగా పుడతానని కలలు కనగలడు.ముస్లిమో,క్రైస్తవుడో అయితే తన బాధలకూ, త్యాగాలకూ ప్రతిఫలంగా స్వర్గ సుఖాల్ని ఊహించుకోగలడు. కాని నేనేం ఆశించాలి? నా కంఠం చుట్టూ ఉరిత్రాడు బిగుసుకొని,కాళ్ళ క్రింది చెక్కలు తప్పుకున్న క్షణమే నాకు అంతిమ క్షణం. అది నాకు తెలుసు. నేను- వేదాంత

పరి భాషలో చెప్పాలంటే – నా ఆత్మ అంతటితో ఆఖరు. ఆ తర్వాత మరేం మిగలదు.ఈ దృష్టిలో అర్థం చేసుకోగల సాహసం నాకుంటే- మహత్తరమైన ముగింపులేని పోరాటంతో కూడిన ఈ కొద్ది పాటి జీవితం ఒక్కటే నాకు గొప్ప బహుమానం. ఈ లోకంలో గానీ, పరలోకంలోగానీ బహుమానాలు పొందాలన్న ఏ స్వార్ధ చింతా, అభిలాషా లేకుండా, పరమ నిస్వార్ధంగా దేశస్వాతంత్ర్యం కోసం నా జీవితాన్ని అంకితం చేశాను. ఇంకోవిధంగా చెయ్యటం నా చేతకాదు. మానవజాతి సేవ, మానవాళి విముక్తి కోసమే తమ జీవితాలను అంకితం చేసుకొనే మనస్తత్వం గల స్త్రీ పురుషుల సంఖ్య పెరిగిన రోజు- ఆ రోజే స్వేచ్ఛాయుగానికి నాంది పలుకుతుంది.

దోపిడీదార్లనూ, పీడకుల్నీ, నిరంకుశుల్నీ సవాలు చేయడానికి ఈ జన్మలోగానీ, మరు జన్మలోగాని, మరణానంతరం స్వర్గంలోగాని, రాజు నౌదామనో ఇతర పారితోషికాలు పొందుదామనో కాదు కోరవలసింది. మానవ జాతి మెడపైనుంచి దాస్యమనే కాడిని తొలగించాలని, స్వేచ్ఛనూ, శాంతినీ స్థాపించాలనీ ఉత్తేజం పొందాలి. సంకుచిత దృష్టి గలవారికిది పొరపాటనిపించినా, ఉదార విశాల దృష్టి గలవారందరూ దీన్ని చరితార్ధమైన ఒకే ఒక పంథాగా గుర్తించి అనుసరించగలరు. ఇలా ఉదాత్త ఆశయం పట్లగల గౌరవ భావాల్ని గర్వంగా చిత్రించటం సాహసమే అవుతుంది. అలా అన్నవాణ్ణి మూర్ఖుడనో, దుష్టుడనో అంటారు. గుండెలో ఉప్పొంగే ఉద్రేకం, ఆశయబలం ఎంతగాఢమైనవో వాడికి అర్థం కావు కాబట్టి వాణ్ణి క్షమించి వేద్దాం. వాడి గుండె ఒట్టి మాంసం ముద్దకంటే చచ్చుది. వాడి చూపులు పరమ నిర్జీవాలు. ఇతరేతర ప్రయోజనాల ప్రభావం వాణ్ణలా చేశాయి. ఆత్మవిశ్వాసాన్ని గర్వంగా వ్యాఖ్యానించే అవకాశం ఎప్పుడూ వుంటుంది. ఇది విచారకరం, బాధాకరం అయినా తప్పదు.

బాగా ప్రచారంలో ఉన్న విశ్వాసాల్ని వ్యతిరేకించినా, విమర్శకతీతుడనీ, దోషరహితుడనీ జనంలో ముద్ర వేసుకున్న ఒక గొప్ప వ్యక్తిని విమర్శించినా, నువ్వొట్టి డంబికుడవని ఆ జనమే నిన్ను తిట్టిపోస్తుంది. దీనికి కారణం వారి బుద్ధిమాంద్యమే. విప్లవకారుడైనవాడికి తప్పనిసరిగా ఉండవలసిన గుణాలు రెండు – ఒకటి విమర్శనా ధోరణి, రెండు స్వతంత్ర ఆలోచనా సరళి. మహాత్ముడు చాలా గొప్పవాడు. కాబట్టి ఎవ్వరూ ఆయన లోపాల్ని వేలెత్తి చూపకూడదు. జన్మలో ఎంతో ఉన్నతంగా నిలవగలిగాడు కాబట్టి, రాజకీయాల్లో గాని, మతంలో గాని, ఆర్థిక విషయా విషయాల్లో గాని, నైతిక విషయాల్లో గాని ఆయన చెప్పిందే వేదంగా భావించాలి. ఆ మాటల్లో నీకు నమ్మకం కుదిరినా కుదరకపోయినా అదంతా నిజమని ఒప్పుకు తీరాలి. ఇలాంటి మనస్తత్వం దేశపురోగమనానికి కాదుగదా, తిరోగమనానికి దారితీస్తుంది.

సర్వశక్తిసంపన్నుడైన దేవుడి పైన మన తాతముత్తాతలు నమ్మకం కుదుర్చుకున్నంతమాత్రాన, ఆ నమ్మకాన్ని గాని ఆ దేవుడి వునికినిగాని సవాలు చెయ్యకూడదా? ఎవరైనా అలా సాహసిస్తే మతద్రోహి, భ్రష్టుడు అనిపించుకోక తప్పదు. తన బలమైన వాదంతో ఎదుటి వారి వాదాల్ని చిత్తుగా తిప్పికొట్టగలిగితే, పరమేశ్వరుడి దురాగ్రహానికి గురికావడం వల్ల వచ్చే కష్టనష్టాలకు గుండెనిబ్బరం చెదరకపోతే అతణ్ణి డాంబికుడంటారు. అలాంటప్పుడు ఈ వృధా చర్చతో కాలహరణం చెయ్యడమెందుకు? ఈ విషయాన్నంత తర్కించడమెందుకు? ఈ సమస్య జనం ముందుకు మొదటిసారిగా ఇప్పుడే వచ్చిందిగనుక ఈ విషయంలో ఇదే చర్చకు దారితీస్తుంది కనుక సుదీర్ఘమైన పరిశీలన చెయ్యవలసివచ్చింది.

నన్ను నాస్తికుణ్ణి చేసింది గర్వం కాదని స్పష్టం చేశాననుకుంటాను. నా వాదనా సరళి నచ్చిందీ లేనిదీ చెప్పవలసింది పాఠకులేకాని నేనుకాదు. ప్రస్తుత పరిస్థితిలో నాకు దేవుళ్ళ పైన నమ్మకమే వుంటే నా జీవితం ఎంతో హాయిగా వుండేది. నా గుండె బరువు తేలికనిపించేది. దైవనమ్మకం లేనందువల్ల పరిస్థితులు పరమ నీరసంగా తయారై, కర్కశంగా కూడా రూపొందవచ్చు. కాసింత భక్తి పారవశ్యమే వుంటే నాకీ క్షణం ఎంత మధురంగా వుండేదో! కానీ నా జీవితంలో నిర్దాక్షిణ్యమైన ఈ పరిస్థితిని ఎదుర్కోడానికి ఏ మత్తు అక్కరలేదు. నేను వాస్తవవాదిని.హేతుబద్ధమైన ఆలోచనలతో నా సహజ దౌర్బల్యాన్ని అధిగమించాలని ప్రయత్నిస్తున్న వాణ్ణి. అయితే అన్నివేళలా నేను గెలవకపోవచ్చు. ప్రయత్నించడం మనిషి కనీసపు బాధ్యత.ఫలితం పరిస్థితులకే వదిలెయ్యాలి.

ఇక రెండో విషయానికొద్దాం.

దేవుడి వునికి గురించి చిరకాలంగా వుంటున్న నమ్మకాన్ని కాదనడానికి గర్వమే కారణం. కాదనుకుంటే మరో కారణమేదైనా వుండాలి, వుందికూడా. అదే హేతువాద దృక్పథం. ఈ హేతుదృష్టి ఏమాత్రం ఉన్నా మనిషి తన పరిసరాల్ని అర్థం చేసుకోగలడనే నా అభిప్రాయం. సాధారణంగా ప్రత్యక్ష ప్రమాణాలు లేనప్పుడే మతతత్వానికి ప్రముఖ

స్థానం లభిస్తుంది. నేనిదివరకే చెప్పినట్టుగా ఒక విప్లవకారుడి అభిప్రాయం ప్రకారం, మానవుడి హృదయదౌర్బల్యం వల్లనే మతతత్వం ఉత్పన్నమౌతుంది. ప్రత్యక్ష ప్రమాణాలు అసలేవీ లేని కాలంలో, ఈ విశ్వ రహస్యం గురించి, భూత,భవిష్యత్, వర్తమానాల గురించి ఆలోచించడానికి కావలసినంత తీరిక వున్న కాలంలో ప్రతివాడూ తనకు తోచిన విధంగా ఈ సమస్యను పరిష్కరించాలని చూశాడు. విభిన్న మత సిద్ధాంతాలలో మౌలిక బేధాలిందువల్లనే వచ్చాయి. ఒక్కొక్కప్పుడు ఇవి పరస్పరం విరుద్ధంగా తయారై తమలో తాము సంఘర్షించుకుంటాయి కూడా. ప్రాచ్య, పాశ్చాత్య దేశాల మధ్య ఈ మత విబేధాలు ఎలాగూ ఉన్నాయి. అంతేకాదు, ఇటు ప్రాచ్య దేశాల్లోనూ వివిధ మత సాంప్రదాయాల మధ్య ఎన్నెన్నో విబేధాలున్నాయి.ప్రాచ్య దేశాలలో హిందూ మతానికీ, ముస్లీం మతానికీ చుక్కెదురు. ఇండియాలో కొన్ని వేల సందర్భాలలో బౌద్ధజైనులు, బ్రాహ్మణ మతానికి వ్యతిరేకంగా వున్నాయి.బ్రహ్మణ మతంలో మళ్ళీ ఆర్యసమాజమనీ, సనాతన ధర్మమనీ పరస్పర విరుద్ధమైన మత విశ్వాసాలున్నాయి.

గతించిన యుగాలకు చెందిన ఒక స్వతంత్ర భావుకుడు చార్వాకుడు. చార్వాకుడొకరా, పలువురా? ఏమైతేనేం.ప్రాచీన కాలములోనే దైవాధికారాన్ని సవాలుచేశాడు. కాబట్టి ప్రధాన విషయం గురించి ఈ భిన్న మతాలన్నీ విభేధిస్తున్నాయి. ప్రతివాడూ తనమతమే నిజమనుకుంటాడు. అదే దౌర్భాగ్యం. అజ్ఞానానికి వ్యతిరేకంగా ముందు ముందు మనం సాగించబోయే పోరాటంలో ప్రాచీన భావుకుల, మేధావుల ప్రయోగాలనూ, భావననూ ప్రాతిపదికగా వుపయోగించుకొనే బదులు, ఈ నిగూఢ సమస్యకు పరిష్కారాన్ని సాధించడానికి బదులు మనం జడత్వం వల్ల విశ్వాసం, విశ్వాసం అంటూ గొంతు చించుకొని గోల చేస్తున్నాం. ఇంకా ఎవరి విశ్వాసాల్ని వారు పట్టుకొని వేలాడుతూనే వున్నారు.మానవ ప్రగతి స్థంభించిందంటే నేరస్తులు వీరే.

ప్రగతిని కోరే వారెవరైనా సరే, పాత మతాలకు సంబంధించిన ప్రతి అంశాన్నీ విమర్శించి,సవాల్ చెయ్యాలేగాని, గుడ్డిగా నమ్మకూడదు. పదిమంది పాటిస్తున్న మత విశ్వాసాన్ని ఏమూల కామూల శోధించి,ఒక అంశం తరువాత మరొక ఆంశాన్ని తర్కించాలి. ఆ తర్వాత కూడా ఒకరికి మత సిద్ధాంతంలో నమ్మకం ఏర్పడితే , ఆనమ్మకానికి స్వాగతం. అతని తర్క పద్ధతి అప సవ్యమై ఉండవచ్చు. తప్పు దారి తొక్కవచ్చు. లోపభూయిష్టం కావచ్చు.- అతని జీవితానికి హేతు దృక్పథమే ధృవతార కాబట్టి అతణ్ణి సరిదిద్దే అవకాశం ఉంది. గుడ్డి నమ్మకమే పరమ ప్రమాదకరం. ఇది బుద్ధిని మందగింప జేస్తుంది. మనిషిని వెనక త్రోవ పట్టిస్తుంది. వాస్తవవాదినని చెప్పుకునేవాడు పాత మతాన్ని మొత్తంగానే ప్రశ్నించాలి. తర్క బలాన్ని ఎదుర్కోలేకపోతే అది కుప్ప కూలి పోతుంది. అప్పుడతడు చెయ్యవలసిన మొదటిపని పాత సిద్ధాంతపు కట్టడాన్ని తుత్తునియలుచేసి ఒక నవ్య తత్వ నిర్మాణానికి కావలసిన స్తలాన్ని సమకూర్చడం.అంతవరకు నిర్మూలనం.దీనిమీదట నిర్మాణాత్మక కార్యక్రమం మొదలవుతుంది. పునర్నిర్మాణం కోసం ఒక్కొక్కప్పుడు పాత మతవిశ్వాసాల తాలూకు సామాగ్రి కొంతయినా అవసరం కావచ్చు.ఈ విషయం గురించి నేనెక్కువగా అధ్యయనం చేయలేదని ముందుగానే ఒప్పుకుంటాను. ప్రాచ్య మతాన్ని అద్యయనం చేద్దామని నాకు చెడ్డ కోరిక. కాని తగిన అవకాశం లేదు. పాత మత సిద్ధాంతాల లోపాల్ని మాత్రం సవాలు చేసేంత నమ్మకం, ధైర్యం నాకేర్పడ్డాయనే అనుకుంటాను. ఈ చరాచర ప్రకృతినంతా శాసించి నడిపే పరబ్రహ్మ పదార్థం ఏదీలేదని నా గట్టి అభిప్రాయం. ప్రకృతి అంటే నమ్మకముంది.ఆ ప్రకృతిని మానవుడు తన సేవా సాధనంగా మార్చుకోవడమే అభుదయ లక్ష్యం .నేపథ్యంలో నిలిచి దీన్ని నడిపే చైతన్య పూరితమైన చోదక శక్తేదీ లేదు. ఇదీ మన అవగాహన.

ఆస్తికుల్ని మనం కొన్ని ప్రశ్నలడగవచ్చు. సర్వాంతర్యామీ, సర్వజ్ఞుడూ, సర్వశక్తిసంపన్నుడూ అయిన దేవుడనేవాడొకడుంటే ఈ ప్రపంచాన్ని సృష్టించిందెందుకో చెప్పమనండి.ఎన్నో దుఖాలతో నిండి గందరగోళంగా వున్న ఈ లోకంలో ఒక్క జీవి కూడా సంతృప్తి పొందక పోవడానికి కారణ మేమిటో? ఇది దేవుడు చేసిన నియమం అని మాత్రం అనకండి. దేవుడు కూడా ఒక నియమానికి బద్ధుడై వుంటే, ఆయన సర్వశక్తి సంపన్నుడు కాలేడు కదా? ఇదంతా దైవలీల అని కూడా అనకండి; నీరో చక్రవర్తి తన సంతృప్తి కోసం ఒక్క రోమ్ నగరాన్ని తగలబెట్టించాడు. కొద్దిమందినే వధించాడు. కొన్ని బాధల్నే కల్పించాడు. అయితే చరిత్రలో అతని స్థానం ఏమిటి? చరిత్రకారులు ఏఏ పేర్లతో అతన్ని వర్ణిస్తారు? నిరంకుశుడు, నిర్దయుడు, దుర్మార్గుడు- ఎన్నో నిందా వాచకాలతో పేజీలకు పేజీలు నలుపెక్కాయి. అతన్ని గురించి ప్రయోగించని దూషణలు లేవు. కేవలం తన ఆనందం కోసం వేలాది మంది ప్రాణాలు తీసిన ఛెంఘిజ్ ఖాన్ పేరంటేనే మనకు ద్వేషం. మరి ప్రతి రోజూ, ప్రతి గంటా, ప్రతి నిముషం ఎన్నో ప్రాణాల్ని బలిగొంటున్న సర్వ శక్తి సంపన్నుడైన దేవుణ్ణి-శాశ్వత నీరోని – మీరెలా సమర్ధిస్తారు? ప్రతిక్షణం ఛెంఘీజ్ ఖాన్ ను

తలదన్నిపోయే దేవుడి అక్రమాలను ఎలా ప్రశంసిస్తారు? నిరంతరం దారుణమైన అశాంతికి నిలయమైన నరకం లాంటి ఈ లోకాన్ని ఎందుకు సృష్టించాడని ప్రశ్నిస్తున్నాను? మనిషిని సృష్టించకూడదని దేవుడు భావించివుంటే , ఆ శక్తి ఆయనకుందిగదా, మరెందుకు సృష్టించాడు మనిషిని? దీనికంతతికీ ఏమిటి మీ సమాధానం? పాపం పుణ్యం తెలియని అమాయకుల్ని రక్షించడానికి, దుష్టుల్ని శిక్షించడానికీ అంటారా? భేష్! తీవ్రంగా గాయపరచి, ఆ తర్వాత మందుపూసే మనిషిని మీరు సమర్ధించగలరా? మొదటేమో ఆకలిగొన్న సిం హాల ముందు మనుషుల్ని తొయ్యడం , ఆ తర్వాత ఆ క్రూరమృగాల బారినుండి ఒకవేళ తప్పించుకోగలిగితే అప్పుడేమో గౌరవించడం ఆ ద్వంద ధోరణిని ప్రదర్శించే కపటుల్ని మనం ఎంతవరకు వెనకేసుకురావచ్చు? అందుకే అడుగుతున్నాను. " సర్వజ్ఞుడైన దేవుడు ఈ ప్రపంచాన్ని ,అందులోని మానవుణ్ణి ఎందుకు సృష్టించాడు?" అని .వినోదం కోసమా? అయితే దేవుడికీ, నీరోకి తేడా ఏమిటి?

మహమ్మదీయులారా!, క్రైస్తవులారా! ఈ ప్రశ్నకు మీ జవాబులేమిటో చెప్పుకోండి? పూర్వ జన్మలో మీకు నమ్మకం లేదాయె. ఈ జన్మలో పాపం పుణ్యం ఎరగని అమాయకులు పూర్వజన్మలో చేసుకున్న పాపాల ఫలితంగా కష్టాలను అనుభవించితీరాలనే వాదాన్ని హిందువుల్లాగా మీరు చేయలేరుగదా? అంత శక్తి గల దేవుడు "మాట" ద్వారా ఈ ప్రపంచాన్ని సృష్టించడానికి ఆరు రోజులపాటు పాటుపడవలసిన అవసరం ఏమిటి? అంతా సవ్యంగానే సాగుతోందని ప్రతిరోజు అనవలసిన అవసరం ఎందుకొచ్చింది? రమ్మనండి ఆ దేవుణ్ణి ,గత చరిత్రను చూపించండి. ఈ నాటి పరిస్థితుల్ని అధ్యయనం చెయ్యమనండి. "అంతా సవ్యం" అనడానికి సాహసించగలడేమో, అదీ చూద్దాం.

చీకటి కొట్లలాంటి జైళ్ళు,   ఒక వైపు మురికివాడల మధ్య గుడిసెల్లో నివసించే లక్షల, కోట్ల నిర్భాగ్యులు,   మరోవైపు వ్యర్ధంగా పడివున్న సంపదలు.   పేదల రక్తాన్ని పీల్చే పెట్టుబడిదారీ రక్కసి జలగలు,   పట్టీపట్టనట్టుగా చూస్తూ దోపిడీకి గురౌతున్న శ్రామికులు,   ఏమాత్రం ఆలోచించేవారికైనా గుండె చెరువయ్యే విధంగా దుబారా అవుతున్న మానవుల శక్తియుక్తులు,   అదనపు ధాన్యోత్పత్తిని-కష్టపడి పండించే శ్రమజీవులకందకుండా- గంగ పాలు చేసే నిర్దయ , వీటన్నిటినుంచీ అటు మానవుల ఎముకల పోగుల పునాది మీద లేచిన రాజ సౌధాలు   ఇదంతా చూసి కూడా " అంతా సవ్యం " అంటాడా దేవుడు?   ప్రపంచంలో ఇంత దారుణమైన పరిస్థితులెందుకున్నాయి?   ఇదే నా ప్రశ్న.   మీరు మాట్లాడరు సరే.   మిమ్మల్ని వదలి ముందుకు వెళతాను.

ఓ హిందువుల్లారా! పూర్వజన్మలోని పాపులే ఈ జన్మలోని పీడితులూ,దరిద్రులూ అంటున్నారుగదా మీరు? అంటే ఈ జన్మలోని పీడకులు గత జన్మలో సజ్జనులా? అందుకే అధికారం అపనమ్మకాన్నీ కొట్టేయగల సిద్ధాంతాలను కనిపెట్టిన మీ పూర్వీకులున్నారే ,మహా తెలివైనవాళ్ళు. అయితే ఈ వాదం కూడా ఏమాత్రం నిలుస్తుందో చూద్దాం.

సుప్రసిద్ధ న్యాయశాస్త్రవేత్తల దృష్టిలో ,తప్పుకు తగిన శిక్షవెయ్యాలనో ,సంస్కరించాలనో – ఇలా ఏవో కొన్ని లక్ష్యాల్ని పెట్టుకొనే నేరస్తుల్ని దండించడం జరుగుతుంది.తప్పుకు తగిన ఫలితం అనుభవించాలన్న దృష్టిలో శిక్ష వెయ్యడం మంచిది కాదని ఆలోచనాపరులంతా చెబుతున్నారు.మళ్ళీ తప్పులు చెయ్యకుండా ఉండడం కోసమే శిక్ష వేసేపద్ధతివల్ల కూడా ప్రయోజనం లేదని వారి అభిప్రాయం. పోతే మానవ ప్రగతికి అవసరమైనది సంస్కరణలతో కూడిన శిక్షావిధానమే. నేరస్తుణ్ణి మంచి పౌరుడుగా మార్చి సమాజంలో కలపటమే దాని లక్ష్యం. మానవులు నేరస్థులే అనుకొంటే, మరి భగవంతుడు విధించే శిక్ష స్వభావం ఎలాంటిది? చెట్టుగానో ,పుట్టగానో, కుక్కగానో,నక్కగానో పుట్టమని దేవుడు దండన విధిస్తాడని అంటారు మీరు.ఈ దండనల సంఖ్య ఎనభైనాలుగు లక్షలని లెక్క దీస్తారు.ఈ శిక్షలెంతవరకు మానవుల్ని సంస్కరించగలవో చెప్పమని అడుగుతున్నాను.ఏదో పాపం చేసినందుకు గాడిదగా పుట్టామని చెప్పేవాళ్ళను ఎంతమందిని చూశారు మీరు? ఒక్కడూ కనబడడు. పురాణాల దస్త్రం విప్పండి. మీ కట్టుకథల్ని స్పృశించే అవకాశం లేదు నాకు.అంతేకాదు. ఈ ప్రపంచంలో పేదరికం కంటే గొప్ప పాపం లేదని మీకు తెలుసా? పేదవాడుగా శిక్షల్ని ప్రతిపాదించే నేరశాస్త్రజ్ఞుల్ని , న్యాయ శాస్త్రవేత్తలనూ,శాసన కర్తలనూ ఎలా మెచ్చుకోగలరు? మీ దేవుడు ఈమాత్రం ఆలోచించలేడా? లేకుంటే- మానవకోటి స్వానుభవం ద్వారా అనుభవించవలసివచ్చిన బాధల మూలంగానే దేవుడంతటివాడు తెలుసుకోవలసి వచ్చిందా? అక్షర జ్ఞానమేలేని నిరుపేద అయిన చర్మకారుడి ఇంట్లోనో, పాకీ వాడి

ఇంట్లోనే పుట్టేవాణ్ణి గురించి మీ అభిప్రాయం ఏమిటి? వాడు పేదవాడు.కనుక చదువుకోలేడు.అంతకంటే పెద్దకులంలో పుట్టి గొప్పవాళ్ళమనుకునే తోటి మనుషులు అతణ్ణి అసహ్యించుకుంటారు. నీచంగా జూస్తారు. ఒక పక్క తన అజ్ఞానం, పేదరికం, మరో ప్రక్క సమాజం నుండి తనకు లభించే నిరాదరణ – వీటివల్ల సమాజం అంటేనే తన గుండెను బండగా మార్చుకుంటాడు. అలాంటి పరిస్థితిలో అతడొక పాపం చేస్తే దాని ఫలితం పొందవలసిందెవరు? తానా? దేవుడా? లేకపోతే సమాజంలోని విద్యావంతులా? ఎవరు? గర్వంతో , అహంకారంతో ఉద్దేశ్యపూర్వకంగానే బ్రాహ్మణులు వీళ్ళందర్నీ అజ్ఞానంలో అట్టిపెట్టారు. "పరమ పవిత్ర" గ్రంధాలైన వేదాలనుంచి ఏవో కొన్ని వాక్యాలు విన్నారని వారి చెవుల్లో మరిగే సీసం పోయించారు.ఈ శిక్ష మాటేమిటి? వాళ్ళేదైనా అక్రమం చేస్తే దానికెవరిది బాధ్యత? బాధ్యత ఎవరిదైనా శిక్ష వాళ్ళే అనుభవించాలా? మిత్రులారా, వినండి. ఈ సిద్ధాంతాలన్నీ కడుపు నిండినవాళ్ళు సృష్టించినవే. అక్రమంగా తాము సంపాదించుకున్న అధికారాన్ని,సిరి సంపదల్ని సమర్ధించుకునేందుకే ఇవన్నీ. ఆప్టన్ షింక్లేరు అనుకుంటాను ఒకచోట అంటాడు. మనిషికి దైవం పైన నమ్మకం కలిగించు, ఆతర్వాత అతని ఆస్తిపాస్తుల్ని కొల్లగొట్టడం తేలిక అని. దోపిడీకి గురయ్యేవాడే నీకు సాయపడతాడు కూడా. మత ప్రచారకులు, అధికార మధాంధులూ కుమ్మక్కై ఈ జైళ్ళనూ ,శిక్షలనూ ,ఈ సిద్ధాంతాలనూ పుట్టించారు.

ఇంకో ప్రశ్న అడుగుతున్నాను, ఎవరైనా పాపంగానీ, నేరంగానీ చేస్తున్నప్పుడే సర్వ శక్తి సంపన్నుడైన మీ దేవుడెందుకు నిరోధించడంలేదు? ఆ పని ఆయన్ అవలీలగా చేయవచ్చు గదా! యుద్ధోన్మాదుల్నీ వారి దురాగ్రహాల్నీ హతమార్చి, ప్రపంచ యుద్ధ సమయంలో మానవకోటిమీద విరుచుకుపడ్డ దారుణ దురాగతాల్ని ఎందుకు నిరాకరించలేదు. ఇండియాకు స్వాతంత్ర్యం ఇవ్వాలన్న హృదయ పరివర్తనను బ్రిటిషువారికి ఎందువల్ల కలిగించడం లేదు. ఉత్పత్తి సాధనాలను తమ గుప్పిట్లో పెట్టుకున్న పెట్టుబడిదారులందరికీ త్యాగబుద్ధినీ ,పరోపకార భావాన్నీ కలిగించి ,ఈ పెట్టుబడిదారీ దాస్యం నుంచి శ్రామిక జనాన్నేకాదు, మానవ సమాజాన్ని ఎందుకు విముక్తి చెయ్యడు? సోషలిష్టు సిద్ధాంతం ఆచరణీయమా,కాదా అని మీరు తర్కిస్తున్నారే? దాన్ని ఆచరణీయం చెయ్యమని మీ దేవదేవుడికే వదిలేస్తున్నాను. సర్వజన శ్రేయస్సుకు సంబంధించినంతవరకూ సోషలిజాన్ని అందరూ గుర్తిస్తున్నారు. ఆచరణయోగ్యం కాదనే సాకుతోనే వ్యతిరేకిస్తున్నారు. స్వయంగా ఆ సర్వేస్వరుణ్ణే జోక్యం చేసుకొని చక్కదిద్దమనండి. డొంక తిరుగుడు వాదాలు మాత్రం చెయ్యకండి. బ్రిటీషు వారి శక్తిని ఎదుర్కొనే సాహసం మనకులేదు గనకనే మన దేశంలో వాళ్ళ పాలన కొనసాగుతుంది గాని, దేవుడి కోరికవల్ల మాత్రం కాదని చెబుతున్నాను. తుపాకులూ, రైఫిళ్ళూ,బాంబులూ, బులెట్లూ, పోలీసులూ, సైన్యం- వాటికితోడు మన నిర్లక్ష్యం వల్లనే బ్రిటీషు వాళ్ళు మనల్ని తమ కాళ్ళ కింద తొక్కి పెడుతున్నారు. ఒక జాతిని మరొకజాతి పరమ దుర్మార్గంగా దోచుకోవడమనే దారుణ పాపకార్యానికి ఒడిగడుతున్నారు. అంతేగాని , దేవుని దయతోనో ,సహాయంతోనో మాత్రం కాదు. ఏడీ మీ దేవుడు? ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? మానవ జాతి అనుభవిస్తున్న యాతనల్ని చూసి ఆనందిస్తున్నాడా? అతడొక నీరో ,ఛంఘీజ్ . దేవుడు నశించాలి.

అయితే ఈ ప్రపంచం ఎలా పుట్టిందో, మనిషెలా పుట్టాడో వివరించమంటున్నారా? అలాగే. ఈ విషయం గురించి చార్లెస్ డార్విన్ కొంత దారి చూపాడు. అతని రచనలు చదువుకోండి. సోహం స్వామి వ్రాసిన "కామన్ సెన్స్ " కూడా చూడండి. మీ ప్రశ్నలకు కొంతవరకైనా జవాబు లభిస్తుంది. సూక్ష్మాతి సూక్ష్మకణాల రూపంలో వివిధ ద్రవ్యాల ఆకస్మిక సం యోగ సమ్మిశ్రమణాల ఫలితంగా ఈ భూమి రూపొందింది. ఎప్పుడు? చరిత్ర నడగండి. ఇదే గతిక్రమం వల్ల జీవజాలం ఆ తర్వాత ఎంతోకాలానికి మానవుడు రూపొందడం జరిగింది. ఆ పైన సాగిందంతా ప్రకృతితో మానవుని ఘర్షణవలన ప్రకృతిని శాసించాలనే అతని ప్రయత్నం వల్ల ఏర్పడిందే. ఈ విషయాన్ని ఇంకా సూక్ష్మంగా చెప్పటం వీలుకాదు.

పూర్వ జన్మలో పాపాలు చెయ్యకపోతే మనిషి గుడ్డివాడుగానో , కుంటివాడుగానో ఎందుకు పుడుతున్నాడని మీరు మరో వాదం చెయ్యవచ్చు.జీవశాస్త్రజ్ఞులు దీనికి శాస్త్రపరమైన కారణాలు చెప్పేవున్నారు.తాము మంచి పనులు చేస్తున్నారో లేదో అనేస్పృహవున్నా లేకపోయినా అంగవైకల్యంతో పిల్లలు పుట్టడానికి కారణం తల్లిదండ్రులేనని వారి నిర్ణయం.

పిల్ల తరహాగా అనిపించినా ,సాధారణంగా ఇంకో ప్రశ్న అడుగుతారు

మీరు. అసలు దేవుడనేవాడే లేకపోతే జనానికి దైవనమ్మకం ఎలా ఏర్పడుతుంది? దీనికి నా సమాధానం చాలా స్వల్పమైనదీ,చిన్నదీ. దెయ్యాలను , క్షుద్ర శక్తుల్నీ ఎలా నమ్ముతూ వచ్చారో , దేవుణ్ణీ అలాగే నమ్ముతూ వచ్చారు. కాకుంటే దైవభావం విశ్వవ్యాప్తమై ,అదొక తత్వంగా రూపొందింది. పరమ పురుషుడొకవున్నారని నూరిపోసి జనాన్ని మభ్యపెడుతూ, దాస్యంలో అట్టిపెట్టి , తమ ఉన్నత స్తానాల్ని నిలుపుకునేందుకు దేవుణ్ణి ప్రమాణంగా చూపుతున్న దోపిడీదారుల చాకచక్యమే దైవభావం పుట్టుకకు కారణమని కొందరు తీవ్రవాదులంటారుగానీ నేనలా అనుకోవడంలేదు.విశ్వాసాలూ,మతాలూ, మతశాఖలూ, ఇతర సంస్తలూ- ఇవన్నీ కాల క్రమాన నిరంకుశంగా ప్రవర్తించే దోపిడీ సంస్థలన్నీ మనుషుల్నీ వర్గాల్నీ బలపరిచే సాధనాలుగా మారిపోయాయనడంలో మట్టుకు నాకు వారితో భిన్నాభిప్రాయం లేదు. ఏమతంలోనైనాసరే రాజుమీద తిరగబడడం పాపమే.

దైవభావం ఏర్పడడానికి నా దృష్టిలో కొన్ని కారణాలున్నాయి. మనిషి తన బలహీనతల్నీ, లోపాల్నీ బాగా గుర్తించాక అన్ని రకాల సంకట పరిస్థితుల్లోనూ ధైర్యంగా నిలవడానికి ,ప్రమాదాల్ని నిబ్బరంగా ఎదుర్కోవడానికి దైవభావం అవసరం అయింది. సంపదలెక్కువై భోగభాగ్యాలనుభవిస్తున్న దశలో విశృంఖలంగా విజృంభించకుండా అడ్డుపడి అదుపులో పెట్టడానికి కూడా దేవుణ్ణి పట్టుకురావడం జరిగివుంటుంది.

దేవుడికి సొంత చట్టాలు కొన్ని వున్నట్లుగా , తండ్రికుండే దయాగుణం వున్నట్లుగా మరికొన్ని లక్షణాలు చేర్చి చిత్రించడం జరిగింది.దేవుడి చట్టాల్ని గూర్చి చర్చ వచ్చినప్పుడు మనిషి ప్రమాదకరంగామారకుండా ఉండడానికి దేవుడి అవసరం ఏర్పడింది. ఇక జగత్పితగా తన యోగ్యతను నిరూపించవలసి వచ్చినప్పుడు తండ్రిగా, తల్లిగా, సోదరిగా, సోదరుడిగా వర్ణించారు.కావలసినవాళ్ళే వెన్నుపోటుపొడిచి, ఏకాకిని చేసినప్పుడు మనిషి ఎంటో మానసిక క్షోభకు గురవుతాడు. అప్పుడు తనని వీడని స్నేహితుడొకడున్నాడని , ఆదరువుగావుండి ఆదుకుంటాడని, సర్వ శక్తి సంపన్నుడు గనుక ఆయన్ను తల్చుకుంటే ప్రమాదం ఉండదని అనుకుని మనిషి ఒకరకమైన ఊరట పొందుతాడు.ఆదిమ కాలంలో మాత్రం ఈ భావం నిజంగానే ఉపయోగకరంగా వుండేది.బాధలపాలైన మనిషికి దైవభావం సహాయకారి.

విగ్రహారాధననీ, సంకుచిత మత వైఖరినీ సమాజం లోగడ ఎలా ఎదిరించి పోరాడిందో, అలా ఈ దైవనమ్మకాన్ని ఎదిరించి పోరాడాల్సివుంది.తన కాళ్ళ మీద తాను నిలవాలనుకున్న మనిషి మత విశ్వాసాన్ని తోసివేయాలి.పరిస్థితులవల్ల ఏర్పడే కష్టాల్నీ, నష్టాల్నీ నిబ్బరంగా ఎదుర్కోవాలంటే వాస్తవవాది కావాలి. దేవుణ్ణి నమ్మటం, రోజు ప్రార్ధనలు చెయ్యడం – ఇవి పరమ నీచమైన స్వార్ధ బుద్ధితో మానవుణ్ణి తక్కువ చేసేవని నాకనిపిస్తాయి. నన్ను బాగు చేస్తాయో, పాడు చేస్తాయో నా విషయానికొస్తే నాకే తెలియదు. ఎన్ని బాధలైనా ఎంతో ధైర్యంగా ఎదుర్కొన్న నాస్తికులు గురించి చదువుకొనియున్నాను. అంచేత, చివరిదాకా, ఉరికంభం మీదైనాసరే తల పైకెత్తుకొని నిలబడాలనే ప్రయత్నిస్తున్నాను.

దీన్నెలా నిర్వహించగలనో చూద్దాం. ప్రార్ధన చెయ్యమని మిత్రుడొకడు ఉపదేశించాడు. నాస్తికవాదం గురించి చెప్పినమీదట " నీ చివరి రోజుల్లో అయినా ఆస్తికుడవైపోతావు " అన్నాడు. అది " అసంభవం " అన్నాను. అలాంటిపని నా పతనాన్ని, నా అధైర్యాన్ని సూచిస్తుంది. స్వార్ధం కోసం చచ్చినా ప్రార్ధించను. పాఠకులారా , మిత్రులారా, ఇది అహంభావమా? ఇది అహంభావమే అయితే నేను అహంభావినే.

–ఏప్రిల్,2007 ఉపాధ్యాయ పత్రిక సౌజన్యంతో

https://vak50.wordpress.com/2007/04/16/%e0%b0%a8%e0%b1%87%e0%b0%a8%e0%b1%86%e0%b0%82%e0%b0%a6%e0%b1%81%e0%b0%95%e0%b1%81-%e0%b0%a8%e0%b0%be%e0%b0%b8%e0%b1%8d%e0%b0%a4%e0%b0%bf%e0%b0%95%e0%b1%81%e0%b0%a3%e0%b1%8d%e0%b0%a3%e0%b0%af%e0%b1%8d/

# నేనెందుకు నాస్తికుడను ?

**- డి. హనుమంతరావు**

*(సెప్టెంబర్ 28 భగత్సింగ్ జయంతి సందర్భంగా ఆయన రాసిన నేనెందుకు నాస్తికుడను ? అనే వ్యాసానికి కవితా రూపం)*

దేశభక్తి అనగానే ప్రతి భారతీయుడి మదిలో మెదిలే రూపం భగత్‌సింగ్. దేశస్వాతంత్ర్యంకోసం చిన్నవయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన అమరవీరుడు భగత్‌సింగ్.

భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినరోజు 7 అక్టోబర్ 1930. దానికి సరిగ్గా మూడురోజుల ముందు జైల్లో గదర్ ఉద్యమకారుడు బాబా రణధీర్‌సింగ్ భగత్‌సింగ్‌ను కలిశాడు. దేవుడిని వేడుకోమని కోరాడు. నాస్తికుడనని చెప్పాడు భగత్‌సింగ్. "తక్కువకాలంలో పేరుప్రఖ్యాతులు వచ్చేసరికి కన్నూమిన్నూ కానక అహంకారంతో ఇలా మాట్లాడుతున్నావు" అంటూ నిందించాడు. అందుకు సమాధానంగా ఆ తర్వాతి రెండు రోజుల్లో అంటే 1930 అక్టోబర్ 5,6 తేదీల్లో రాసిన వ్యాసమే "నేనెందుకు నాస్తికుడను?" (వై అయామ్ యాన్ ఎథీయిస్ట్?).

ఓ 23 ఏళ్ళ యువకుడు అంత మెచ్యూరిటీతో రాయడం చరిత్రకారుల్ని ఆశ్చర్యపరిచింది. చార్వాకుల నుండి జైన, బౌద్ధ, హిందూ, క్రైస్తవ, ముస్లిం మతాలవరకు, పునర్జన్మలు, స్వర్గనరకాలు, మతప్రవక్తలు, పురోహితవర్గాలు, హేతువాదం, ప్రత్యక్షప్రమాణం, డార్విన్ పరిణామవాదం, మార్క్స్ కమ్యూనిజం, సమాజవికాసం, ప్రపంచ విప్లవాలు, స్వేచ్ఛ, భయం, శిక్షలు, సంస్కరణ వంటి ఎన్నో విషయాలున్న గొప్ప విశ్లేషణాత్మక వ్యాసమది.

23 మార్చి 1931న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీసింది బ్రిటీష్ ప్రభుత్వం. ఆ తర్వాత భగత్‌సింగ్ పుస్తకాలను, పేపర్లను తండ్రి కిషన్‌సింగ్‌కు అందజేసింది. లాలా లజపతిరాయ్ స్థాపించిన ఇంగ్లీష్ వీక్లీ "ది పీపుల్" ఆ వ్యాసాన్ని కిషన్‌సింగ్ నుండి సేకరించి సెప్టెంబర్ 27, 1931న మొదటిసారి ప్రచురించింది. పెరియార్ రామస్వామి ఆ వ్యాసాన్ని పి. జీవానందం గారిచే తమిళంలోకి అనువాదం చేయించి "కుడి అరసు" పత్రికలో ప్రచురించారు. ఇంగ్లీషు నుండి హిందీలోకి కామ్రేడ్ శివవర్మ అనువదించగా, తెలుగులోకి జనసాహితీ సంపాదకులు నిర్మలానంద, ప్రజాశక్తిలో బొమ్మారెడ్డి అనువాదం చేశారు. కోట్లాదిమందిని ప్రభావితం చేసిన ఆ వ్యాసం నేడు అనేక సంస్థలు ప్రచురించాయి. గూగుల్‌లో వెతికితే మీకు ఆ స్క్రిప్ట్ లభిస్తుంది.



ఆ వ్యాసాన్ని యధాతథంగా కాకుండా కవితారూపంలో ఓ దీర్ఘకవితగా మార్చి ఇక్కడ అందిస్తున్నాను. భావం పూర్తిగా భగత్‌సింగ్‌దే. కొద్దిమార్పులతో కవితాశైలిని అద్దే ప్రయత్నం చేశాను. చదివి స్పందిస్తారని ఆశిస్తూ.. కవితలోకి వెళ్దాం పదండి...

సర్వశక్తివంతుడు, సర్వాంతర్యామి,
సర్వజ్ఞాని అయిన భగవంతుడు
లేడంటున్నా
లేనే లేడంటున్నా

అహంభావం ఉండొచ్చు నాలో
మానవాతీతుడను కాదు నేను
భావాల సంఘర్షణలో
అది మా భావాలపట్ల గౌరవం
పేరు ప్రతిష్ఠల వలన కాదు
అధ్యయనంతోనే నేనిలా మారాను
దేవుడు నాకు ప్రత్యర్థి కాదు
లేదు కాబట్టి
ఢిల్లీ బాంబుకేసు,
లాహోర్ కుట్రకేసులతో
నాకు పేరొచ్చింది
కానీ అంతకుముందే
కాలేజీలో
అనామక విద్యార్థి దశలోనే
నాస్తికుడిని

అధ్యయనంతోనే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

నాబాల్యం భక్తిమయం
తాత ఆర్యసమాజం
డిఎవి స్కూల్లో గాయత్రీ పఠనం
నాన్నగారి సాంగత్యంలో ప్రార్థనలు

సహాయ నిరాకరణోద్యమ
సమయంలో
జాతీయ కళాశాలలో అడుగిడాను
మతాలపురాణ కథలను తిరస్కరిస్తూనే
దైవవిశ్వాసాన్ని కొనసాగించా

విప్లవపార్టీలో సభ్యత్వం
ఆలోచనల్లో నవ్యత్వం

మొదలెట్టాం
నాయకులతో దైవంపై చర్చలు
ఆ విప్లవనాయకులు కూడా
దైవభక్తులే
మా నాయకుడు,
శచీంద్రనాథ సన్యాల్
కకోరీ కుట్రకేసులో బందీ
'బందీ జీవన్' గ్రంథం
దేవుని మహిమతో ప్రారంభం
కకోరి కుట్రకేసు అమరవీరులు
నలుగురు
సోషలిజం, కమ్యూనిజం తెలిసినా
దైవాన్ని వీడని భక్తిపరులు
'ది రివల్యూషనరీ'
జనవరి 28, 1925న
దేశమంతటా పంచబడ్డ కరపత్రం
అందులోకూడా దేవుని లీలలు
నాటి విప్లవపార్టీలో
నాస్తికత్వం ఉదయించలేదు
అనడానికివే సాక్ష్యాలు

నిశిత పరిశీలనతోనే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

అప్పటిదాకా అనుచరులం
నాయకత్వ బాధ్యతల్ని
భుజానికెత్తుకోవాల్సి వచ్చింది
ప్రతీకార దాడులతో విప్లవం
నిష్ఫలమౌతుందేమోనన్న దశ
ఆలోచనల్ని మథించాం
అధ్యయనం సాగించాం
తొలగింది దైవవిశ్వాసం
నిలిచింది యదార్థవాదం

చదివాం విస్తృతంగా
నిరాలంబస్వామి 'కామన్‌సెన్స్'
అరాచకవాది బకూనిన్
'దేవుడు–రాజ్యము'
కమ్యూనిస్టు పితామహుడు
మార్క్స్ రచనలు
రష్యావిప్లవవీరులు
లెనిన్, ట్రాట్స్కీ రచనలు
పూర్తి నాస్తికుడనయ్యా
1926 చివరికి
గొంగళిపురుగు దశనుండి
సీతాకోకచిలుకలా

ఇక మా విధానం
ప్రజా ఉద్యమాల్లో అహింస
అతిసంక్లిష్ట పరిస్థితుల్లో హింస
ఇక మా కార్యాచరణ
అతిసంక్లిష్ట పరిస్థితుల్లో హింస
ప్రజా ఉద్యమాల్లో అహింస

పరిశోధనతోనే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

1927 మే నెలలో
ఏమరపాటున అరెస్టయ్యా
మారమన్నారు అప్రూవర్‌గా
చెప్పమన్నారు
విప్లవదళంపై తప్పుడు మాటలు
లేకుంటే ఉరిశిక్షే
దేవుడిని ప్రార్థించుకోమన్నారు
ఆ క్లిష్ట పరిస్థితుల్లో
నేను దేవుణ్ణి వేడుకోలేదు
అంటే నేను మారానన్నమాట
నిఖార్సైన నాస్తికుడిగా
నా లక్ష్యంకోసం
జీవితాన్ని త్యాగం చేస్తున్నా
మరుజన్మలో
మహారాజుగా పుడతాననే
హిందువులానో
పరలోకంలో సుఖాన్ని పొందుతాననే
క్రైస్తవ, ముస్లింలానో కాదు
నాకు తెలుసు
ఉరితాడు మెడలోపడి
కాళ్ళకింద బల్ల తొలగిన మరుక్షణం
నా జీవితానికి ఫుల్‌స్టాప్...
ఆ తర్వాత ఏమీ ఉండదు.

భక్తిపరుల్లా
ఇతర జన్మో,
పరలోక నజరానాలో లేకుండా
నిస్వార్థంగా నా జీవితాన్ని
స్వాతంత్ర్యంకోసం అర్పిస్తున్నా
అలా నిస్వార్థంగా
మానవాళికోసం
పాటుపడేవారి సంఖ్య పెరిగిననాడే
మొదలవుతుంది స్వేచ్ఛాయుగం

స్వేచ్ఛాయుగం మొదలయ్యేది
భక్తుల్లా నజరానాలు ఆశించని
నిస్వార్థులతోనే

ఈ మార్గంలో ఎన్నో ఆటుపోట్లు
కానీ! ఇదే ఏకైకమార్గం
ఇలా ఆలోచిస్తే
అహంకారులని ముద్రవేస్తారా?
ఈ ఆదర్శాన్ని గర్వమంటారా?
తనమీద తనకు నమ్మకం లేనివారే
అలా ఆరోపిస్తారు

లోతైన ఆలోచనలతోనే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

నువ్వు
ఓ మతాన్నో, ప్రవక్తనో విమర్శించు
పొగరుబోతు అంటారు
అందుక్కారణం వారి అవివేకం
విమర్శ, స్వతంత్ర ఆలోచన
విప్లవకారుడి ప్రాథమిక లక్షణాలు
తిరోగమనం
మహాత్ములు అతీతమనడం

పూర్వీకుల విశ్వాసాన్ని ప్రశ్నిస్తే
జవాబివ్వలేక

మతద్రోహి, విశ్వాసఘాతకుడు
అంటూ నిందలు
దేవునికి కోపం వస్తే నిన్ను....
అంటూ హూంకరింపులు
అయినా లొంగకపోతే
అహంకారి, పొగరుబోతు బిరుదులు
ఇది
ఇప్పుడు ప్రజలముందు చర్చ
ఈ క్లిష్ట పరిస్థితుల్లో
నేనీ భావాలతో నిలబడటం గర్వమా?
దైవభక్తుడనై
మానసికశాంతిని పొందొచ్చు
అలాగైతే
ఈ భావాలు, ఆశయాలు,
సిద్ధాంతాలెందుకు?
నేను యదార్థవాదిని
ఆలోచిస్తాను హేతువాదదృష్టితో
ఫలితాలు పరిస్థితుల గతుల్లో
ప్రయత్నించడం మనిషి చేతుల్లో

నా నాస్తికత్వానికి కారణం
అహంకాదు
పిసరంత వివేచన

పిసరంత వివేచన ఉన్న ఎవరైనా
పరిస్థితుల్ని హేతువాద దృక్పథంతో
అవగాహన చేసుకోగలరు

ప్రత్యక్షప్రమాణం లభించని చోటే
తాత్వికతకు పట్టు

పూర్వులు
విశ్వరహస్యాన్ని
ఛేదించే ప్రయత్నం చేశారు
ఊహలు అల్లారు
ప్రత్యక్ష ప్రమాణం లభించనిచోట
ఆ ఊహల్లోని తేడాలే
భిన్నధార్మిక మార్గాలు
ప్రాక్పశ్చిమ తాత్వికతల వైరుధ్యాలు
భిన్నమతాల మధ్య వైరుధ్యాలు

ఇస్లాం–హిందూమతాల
మధ్య వైరుధ్యాలు
బౌద్ధం, జైనం–బ్రాహ్మణిజం
మధ్య వైరుధ్యాలు
ఆర్యసమాజం, సనాతన ధర్మాల
మధ్య వైరుధ్యాలు
వైరుధ్యాల్లో వైరుధ్యాలు
వైరుధ్యానికే వైరుధ్యాలు

చరిత్రలోకి వెళ్ళండి
ప్రాచీనకాలంలో చార్వాకుడు
స్వతంత్ర ఆలోచనాపరుడు
దేవుడు పచ్చి అబద్ధమన్నాడు

తాత్వికజ్ఞానంతోనే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

ముందుతరం జ్ఞానుల
అనుభవాలను, ఆలోచనలను
వాడాలి
నేటి అజ్ఞానాన్ని వ్యతిరేకించడంలో–
అంతేకానీ
'మా మతమే సరైంది
మాది విశ్వాసం' అంటూ అరిస్తే
మిగులుతారు
మానవవికాస ప్రతిబంధకులుగా !

నువ్వు అభివృద్ధిని కోరుతున్నావా?
అయితే
వదిలెయ్ మూఢనమ్మకాలను
సవాలు చెయ్ వాటిని !
మతంలోని ప్రతి విషయాన్ని తర్కించు
తర్కానికి నిలబడనిది వదిలెయ్ !
జీవితాన్ని నిర్దేశించేది వివేచనే
పాతవిశ్వాసాలకు వేలాడితే
తిరోగమనవాది
సమస్త పురాతనవిశ్వాసాల్ని ప్రశ్నిస్తే
యదార్థవాది

పాతవిశ్వాసాల్ని ప్రశ్నిస్తేనే
కొత్తతాత్విక నిర్మాణం సాధ్యం
తర్కానికి నిలబడితే
తత్వంలో కలుపుకో
తప్పులన్ని ఏరేసి
ఒప్పుల దారేసుకో

పరమాత్మో, మరోశక్తో
ఈ ప్రకృతిని, ప్రపంచాన్ని
నియంత్రిస్తుందన్న భావనే
అన్నింటికన్నా పెద్ద తప్పు.

అన్నింటికన్నా పెద్దతప్పు
మరోశక్తో, పరమాత్మో
ఈ ప్రకృతిని, ప్రపంచాన్ని
నియంత్రిస్తున్నాడన్న భావన.

అనుభవజ్ఞానంతో
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

ఆస్తికులారా ! బదులివ్వండి !
సర్వశక్తివంతుడు, సర్వాంతర్యామి,
సర్వజ్ఞుడు అయిన దేవుడు ఉంటే
అతనీ సృష్టిని ఎందుకు చేశాడు?
కష్టాలు, కడగళ్ళ ప్రపంచాన్ని
లెక్కలేనన్ని శాశ్వత దు:ఖాల్ని
ఎందుకు సృష్టించాడు?

రోమ్‌నగరం తగలబెట్టిన
నీరో క్రూరుడైతే
వేలమందిని చంపిన
చంఘిజ్‌ఖాన్ దుర్మార్గుడైతే
ప్రతిరోజూ, ప్రతిగంటా, ప్రతిక్షణం
అసంఖ్యాక జనసమూహాన్ని
దుఃఖంలో ముంచుతున్నవాడు
దయామయుడా?

నీరో క్రూరుడైతే
చంఘిజ్‌ఖాన్ దుర్మార్గుడైతే

ప్రతిరోజూ, ప్రతిగంటా, ప్రతిక్షణం
అసంఖ్యాక జనసమూహాన్ని
దుఃఖంలో ముంచుతున్నవాడు
దయామయుడా?

ఎందుకు పుట్టించాడు?
కష్టాలకు, కడగళ్ళకు
విలవిలలాడే మనిషిని
ఇప్పుడు భరిస్తే
వచ్చేజన్మలో బహుమతి అంటారా!
గాయం చేసి
ఆయిట్‌మెంట్ రాయడమా ?
గ్లాడియేటరు విన్యాసాలా ?
ఆకలిగొన్న క్రూరసింహం ముందు
మనిషిని తోసి
ఆనందించేవాడు దైవుడైతే
వాడు నీరోని మించిన శాడిస్టు

మానవీయతలోంచే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

ముస్లింలు, క్రైస్తవులారా !
మీకు పునర్జన్మలు లేవు
సర్వశక్తివంతుడైతే
6 రోజులు ఎందుకు పట్టింది,
ప్రపంచాన్ని సృష్టించడానికి?
దేవుడెందుకన్నాడు?
అంతాసవ్యంగా ఉందని !
ఉంటే పిలవండి
చూసి చెప్పమనండి
నిజంగా సవ్యంగా ఉందో లేదో ?
ఉరిశిక్షపడ్డ ఖైదీల గంజికొట్లను
లక్షలాది మురికివాడల ఆకలికేకలను
పెట్టుబడిదారి జలగలు పీల్చేసిన
బక్కచిక్కిన శ్రామికులను
మనుషుల ఎముకల గుట్టలపై
నిర్మిస్తున్న రాజమహల్లను
చూసి చెప్పమనండి
అంతా సవ్యంగానే ఉందని

పెట్టుబడిదారి జలగలు పీల్చేసిన
బక్కచిక్కిన శ్రామికులను
మనుషుల ఎముకల గుట్టలపై
నిర్మిస్తున్న రాజమహల్లను
చూసి చెప్పమనండి
అంతా సవ్యంగానే ఉందని
.....
ఏం నోరు మెదపరేం?

తార్కికజ్ఞానంతోనే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

ఓ హిందువుల్లారా !
ఈనాటి కష్టాలు పడేవారు
గతజన్మపాపులా?
అంటే నేడు పీడించేవారు
గతజన్మ సాధుపుంగవులా?
అబ్బ ! ఏం తెలివి !!
ఎదురు తిరిగేవాడినే
లేకుండా చేసే తెలివి

న్యాయశాస్త్రంలో శిక్షలకు మార్గాలు 3
ప్రతీకారం, భయం, సంస్కరణ
ప్రగతిశీలవాదులు
ప్రతీకారాన్ని నిందిస్తారు
భయపెట్టడం సరైంది కాదు
సంస్కరణే ఉత్తమం
నేరస్తుణ్ణి నాగరికుణ్ణి చేసి
సమాజానికివ్వడం

పాపం చేశారని
ఆవుగానో, పిల్లిగానో పుట్టిస్తారా?
84 లక్షల శిక్షలు లెక్క చెబుతారా!
సంస్కరణలో
ఈ దండనల ప్రభావం ఎంత?
ఒక్కరైనా చెప్పారా ?
పాపఫలితంగా గాడిదయ్యానని !
పురాణకథలు కాదు,
మీరు అలాంటివారిని కలిశారా?

ప్రపంచంలో
అన్నింటికన్నా పెద్దపాపం ‘పేదరికం’
అంతకుమించిన శిక్షే లేదు
మనిషిని మరింతగా
నేరాలు చేసేట్లు చేసే దేవుడిని
మీరెలా మెచ్చుకుంటారు?

పురోహితవర్గం కావాలనే
కొందరిని విజ్ఞానానికి దూరం చేసింది
వేదాలు వింటే కూడా శిక్షించింది
ఓ పారిశుద్ధ్య కార్మికుడిగా పుడితే
ఎలా ఉంటుంది?
ధనిక కుటుంబంలో పుట్టి,
తనను తాను గొప్ప అనుకునేవాళ్ళు
అతన్ని ద్వేషిస్తారు, హేళన చేస్తారు
అతని అజ్ఞానం, పేదరికం,
సహచరుల ప్రవర్తనతో
బండగా మారిన గుండెతో
అతను చేసే నేరానికి
ఫలితం ఎవరనుభవిస్తారు?
దేవుడా?
అతనా?
చెలామణీలోని ఉన్నతవర్గాలా ?

జైలు, ఉరికంబం, కొరడాలకు
కారణం
మతబోధకులు–పాలకుల
ఉమ్మడి కుట్రలే

చారిత్రక జ్ఞానంతోనే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

డియర్ ఫ్రెండ్స్
ఈ మతసిద్ధాంతాలన్నీ కొందరి సృష్టి
అక్రమంగా సంపాదించిన
అధికారాన్నీ, ఆస్తిని, ఉన్నతస్థితిని
వీటి ముసుగులో
సమర్థించుకుంటారు
ఆప్టన్ సింక్లేయర్ అన్నట్లు

"ఆస్తిని సులభంగా దోచేయాలంటే
ఆత్మ శాశ్వతమని భ్రమింపచేయాలి"

మీ సర్వశక్తివంతుడు
పాపం, నేరం జరుగుతున్నప్పుడే
ఎందుకు ఆపలేదు?
రాజుల్లోని యుద్ధకాంక్షను
ఎందుకు తొలగించడు?
యుద్ధాల నుండి మానవాళిని
ఎందుకు రక్షించడు?

మార్చవచ్చుకదా
భారతదేశవిముక్తికై బ్రిటీషువారి
మనసు!
ఉత్పత్తి సాధనాలమీద
వ్యక్తిగత హక్కు వదులుకోమని
మార్చవచ్చు గదా
పెట్టుబడిదారుల మనసు !

అలాచేస్తే లభిస్తుంది విముక్తి
సమాజానికి పెట్టుబడిదారి
సంకెళ్ళనుంచి
మనమెందుకు ఆలోచించడం
సోషలిజం గురించి ?

ఆంగ్లేయుల అధికారం దైవేచ్ఛకాదు
వారిలో శక్తి సామర్థ్యాలున్నాయి
వారిని వ్యతిరేకించే సత్తా
మనకులేదంతే
ఆంగ్లేయులు
తుపాకులు, తూటాలు, బాంబులతో
మనల్ని కట్టడి చేస్తున్నారు
భగవంతుడి సాయంతో కాదు
మన చేతకానితనం వలన
బ్రిటీష్‌వారు
ఒక్కో దేశాన్ని కబళిస్తూ
దోపిడీ చేస్తున్నారు
మరి దేవుడెక్కడ ?
అతనేం చేస్తున్నాడు?
ఈ మానవాళి కష్టాల్ని చూసి
ఆనందిస్తున్నాడా?
అలా అయితే
అతనొక నీరో !
అతనొక చెంఘిజ్‌ఖాన్ !
అతను నశించాల్సిందే !

సమగ్ర అధ్యయనంతోనే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

విశ్వం పుట్టుక, మానవపరిణామం
ఎలా జరిగిందా?
చదవండి
చార్లెస్ డార్విన్ 'ఆరిజన్ ఆఫ్ స్పీషీస్'
చదవండి
సోహన్‌స్వామి రచన 'కామన్ సెన్స్'
విశ్వపదార్థాల కలయిక, చర్యలో
భూమి
అందులోని
కొన్ని రసాయనాల సమ్మేళనంతో
జీవం పుట్టింది
అంచెలంచెలుగా
మానవుడిస్థాయికి పరిణమించింది

చిన్న పిల్లల్లా అడుగుతారా?
ఎక్కడా లేకుంటే
ప్రజలెందుకు నమ్ముతున్నారని
దయ్యాల్ని, భూతాల్ని నమ్మినట్లే
దేవుణ్ణి కూడా
కాకపోతే దేవుడి విషయంలో
అదో తాత్వికతగా రూపుదిద్దుకొంది

దోపిడీదారులు తెలివిగా
దైవభావాన్ని పుట్టించారని,
ప్రజల్ని నియంత్రిస్తున్నారని
రాడికల్స్ భావన

అలా కాకపోవచ్చు
కానీ
మతాలు, ఆచారాలు
నేడు నిరంకుశ దోపిడీ ఆయుధాలు
రాజుపై తిరుగుబాటు
ఏ మతంలో అయినా పాపమే కదా!

మనిషి తన బలహీనతల్ని తెలుసుకొని
ధైర్యంకోసం
దైవభావాన్ని సృష్టించుకున్నాడు
సంపద, సమాజ నియంత్రణలో
పెద్దమనిషి తరహాలో
ఓ తండ్రిగా, తల్లిగా,
సోదరుడిగా, మిత్రుడిగా–
ఆదిమ సమాజంలో
ఈ భావన వారికి మేలు
ఆధునిక సమాజంలో
ఇదే భావన పెత్తందార్లకు మేలు

శాస్త్రీయదృష్టితోనే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

దైవవిశ్వాసం, ప్రార్థనలు
మనిషిని స్వార్థంతో పతనం చేస్తాయి
మతంలోని మూఢాచారాలపై
ఎంతగా సంఘర్షించామో
దైవవిశ్వాసంపై
అంతగా సంఘర్షించాలి.

ఎంతగా పోరాడామో
మూఢాచారాలకి వ్యతిరేకంగా
అంతగా పోరాడాలి
దైవవిశ్వాసానికి వ్యతిరేకంగా
జ్ఞానఖడ్గంతో చీల్చి చెండాడాలి
అశాస్త్రీయ భావాల్ని

మనిషి తనంతట తాను నిలబడాలి
యదార్థవాది కావాలి
దైవభావన లేకుండా
కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

మనిషి తనను తాను నమ్ముకోవాలి
వాస్తవవాది కావాలి

దైవభావనే లేకుండా
ధైర్యంగా కష్టాలను ఎదుర్కోవాలి

ఇది అహంకారం కాదు
నా ఆలోచనా విధానం
ఇదే నా మార్గం

సంపూర్ణ అవగాహనతోనే
దేవుడు లేడంటున్నా
లేనే లేడంటున్నా

"నువ్వు తప్పక దేవుడిని ప్రార్థిస్తావు
చివరి రోజుల్లో"
అన్నాడో మిత్రుడు
అలా జరిగితే అది నా ఓటమి
కానీ నేను ఓడిపోను

చదివాను
ఎన్ని కష్టాలు ఎదురైనా
ఎదిరించి నిలిచిన నాస్తికుల గురించి
అందుకే

ఉరికంబం ఎక్కేటప్పుడు కూడా
ధైర్యంగా నిలబడతా.

దీన్ని అహంకారం అంటారా !
అలాగే అనుకోండి !!

*(ఈ కవితను వీడియో రూపంలో
Humanist TV
యూట్యూబ్ ఛానల్‌లో చూడవచ్చు)*

◆

# దురాచార సమర్థన!

కరోనావైరస్ వ్యాపనం ఇండియాలో ఉధృతమయ్యాక, వైద్యుల, ప్రభుత్వాల ఆదేశాలను అనుసరిస్తూ భౌతికదూరాన్ని పాటించటం మొదలయింది. ఒకరు మరొకర్ని తాకరాదని, ఒక వస్తువు లేదా వ్యక్తిని తాకిన వెంటనే చేతులు శుభ్రపరచుకోవాలని, మీడియా అంతటా ప్రచారం పెరిగింది మూతికి గుడ్డకట్టుకోవటం, చేతికి శానిటైజర్ వాడటం, భౌతికదూరాన్ని పాటించటం అనే సూచనలను హిందూ సంప్రదాయాలకు అన్వయిస్తూ కొందరు హిందూత్వ పరిరక్షకులు అస్పృశ్యతను సమర్థించే విధంగా, టీవీల్లో యూ ట్యూబ్ వీడియోల్లో ప్రసంగించారు. ఒక సినీ రచయిత కవితలు వినిపిస్తే, ఒక శర్మ టీవీ చర్చల్లో గట్టిగా వాదించాడు. కరోనా వైరస్‌ల్లాంటివి వుంటాయి, వాటివల్ల అంటు రోగాలు వ్యాపిస్తాయి గనుకనే, మన ప్రాచీన రుషులు దివ్యదృష్టితో గ్రహించి 'అంటరాని తనమనే ఆచారాన్ని కల్పించారని వారి వాదనా సారాంశం. ప్రాచీన హైందవ రుషులకు ఏదో అరోగ్యకరమో, ఏది అనారోగ్యకరమో తెలుసునని, వారానాడు ఏర్పర్చిన ఆచారాలన్నీ 'ఆరోగ్య'మనే పునాదిపైనే వున్నాయని కూడా కొందరు విపరీత వ్యాఖ్యలు వినిపించారు. అవకాశం దొరికిందిగదా అని, కరోనా వైరస్‌ను అడ్డంపెట్టుకొని, తమ పనికిమాలిన ఆచారాలకు, సంప్రదాయాలకు అత్యుత్సాహంతో వైజ్ఞానిక సమర్థింపులు సాగించారు.

అయితే, అలాంటి వక్ర బుద్ధులకు సోషల్ మీడియాలోని నవభావాల యువతరం గట్టిగానే బదులిచ్చింది. పోటీగా వీడియోలను, వ్యాఖ్యలను మీడియా అంతటా కుమ్మరించింది. ప్రాచీన హిందూధర్మం బోధించిన కులవ్యవస్థలో అంతర్భాగంగా 'అంటరానితనాన్ని' సమాజంపై బలవంతంగా రుద్దిన ఋషులను, స్మృతులను యువతరం ఎండగట్టింది. వారి వారసులుగా ఈనాటికీ మనలోవుండి, ప్రాచీన దుష్ట సంప్రదాయాలను నిర్లజ్జగా సమర్థిస్తున్న పరాన్నభుక్కుల వల్ల సమాజానికి పెరుగుతున్న ముప్పును హెచ్చరించింది. దాంతో, అస్పృశ్యతా సమర్థకుల విజృంభణకు అడ్డుకట్టపడింది.

ఇటీవల కేరళలోనూ ఇలాంటి బరితెగింపు సమర్థనలు వెల్లడయ్యాయి. ఆ రాష్ట్రంలోని, బ్రాహ్మణ కులంలో 'నంబూదిరీ'లు ఉన్నతులనే ప్రచారం వుంది. వారందరిని ఏకం చేసేందుకు "నంబూదిరీ యోగ క్షేమ సంఘం' వుంది. ఆ సంఘం వారు నడిపే పత్రిక– "స్వస్తి". ఆ పత్రికలో కూడా అస్పృశ్యతను, కులవ్యవస్థను సమర్థిస్తూ ఇటీవల సంపాదకీయం వెలువడింది. "ఇపుడు ఒకరినొకరు తాకకుండా 8 మీటర్ల దూరంలో వుండమని చెప్తున్నారు. నంబూదిరీలు అంతకంటే ఎక్కువే వుండమని ఏనాడో చెప్పారు" అని అందులో చెప్పుకున్నారు. అంతేకాదు, అలా దూరముండాలని చెప్పినందుకు నంబూదిరీలు శాపనార్థాలకు గురయ్యారని, ఆరోగ్యకరమైన ఆచారాన్ని ఏర్పర్చి కూడా నిందల పాలయ్యారని సదురు పత్రికా సంపాదకుడు వాపోయాడు. గతకాలంలో ఏర్పర్చిన అంటరానితనానికి, కరోనా వల్ల వచ్చిన అంటరానితనానికి తేడా ఏముందని ప్రశ్నించాడు. అంతటితో ఆగలేదు. తేనీరు సేవించాక, బ్రాహ్మణులు కప్పులు, గ్లాసులు బోర్లించి పెట్టటం, ఒకరియింటిలోకి వెళ్లే ముందు చెరువునీటిలో మునిగి మడికట్టుకోవటం, భోజనానికి అరటిఆకులు వాడటం– ఇలాంటివన్నీ ఆరోగ్యానికి చెందిన ఆచారాలని పేర్కొన్నాడు.

ఇందుకు బదులుగా, మళయాళీ సోషల్ మీడియా కూడా బాగానే గురిపెట్టి స్పందించింది. అంటరానితనాన్ని పాటించటం మంచిదని ప్రబోధించిన నంబూదిరీలు అంటరాని కులస్త్రీలను లైంగికంగా ఎందుకు వాడుకున్నారు, అభం శుభం తెలియని దళిత బాలికలను యుక్తవయసు రాగానే ఎందుకు అనుభవించారు? చీకటైతే చాలు, బరితెగించి, పరకులస్త్రీలను ఎందుకు ఏకాంత మందిరాలకు పిలిపించుకున్నారు? అంటూ సోషల్‌మీడియాలో స్వస్తి సంపాదకీయంపై విరుచుకుపడింది. నిన్న మొన్నటిదాకా కేరళలో "సంబంధం" అనే ఆచారముంది. 'నాయర్' వంటి శూద్రకులాల యింటికి రాత్రివేళ నంబూదిరీలు వెళితే, వారి రాకను అర్థంచేసుకుని, భర్తలు తమ ఇంటివెనుక తలుపు తీసుకొని బయటికివెళ్లిపోతే, ఆ నంబూదిరీలు వారి భార్యలను అనుభవించి తిరిగివెళ్లిపోయాక మరలా వచ్చేవాళ్లు. ఈ 'సంబంధా'నికి అంటరానితనం అడ్డురాలేదా? అంటూ నవతరం గర్జించింది.

'గర్భాదానం', శుద్ధి ఆచారాల పేరుతో దేశమంతటా ఇలాంటి 'సంబంధా'న్ని అమలుచేసిన ఘరానావంచకుల అనుచరులు ఇపుడు 'అంటరానితనాన్ని' సమర్థిస్తున్నారు. అలాంటి ఆచారాలు మళ్లీరావాలని వారి తపన. ఆ తపన వాస్తవం కాకుండా ఇపుడు మనం పోరాడాలి.